# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- అభివృద్ధికి, సాంప్రదాయ విలువలకు మధ్య సమతుల్యతే సుసంపన్నమైన సమాజానికి పునాది అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- భారతదేశంలో సాంకేతికత పరివర్తనాత్మక మార్పులు తీసుకువచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- నీట్ పునః పరీక్షపై వస్తున్న వదంతులను నమ్మవద్దని.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి సారించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విద్యార్థులకు సూచించింది.
- రాబోయే నాలుగు రోజుల్లో ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది.

====================

అభివృద్ధికి, సాంప్రదాయ విలువలకు మధ్య సమతుల్యతే సుసంపన్నమైన సమాజానికి పునాది అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ లోని బేతుల్ లో ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన "ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా గిరిజన వర్గాల సాధికారత" అనే కార్యక్రమంలో రాష్ట్రపతి ఈరోజు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గిరిజన వర్గాలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో జరిగిన ఈ సదస్సు కేవలం ఈ ప్రాంతానికి మాత్రమే కాకుండా యావత్ దేశానికి ముఖ్యమైనదన్నారు. ఇది దేశాభివృద్ధిలో గిరిజన వర్గాలు కీలక పాత్ర పోషించడానికి సహాయపడుతుందన్నారు. గిరిజన వర్గాల జీవనశైలి సహజంగానే ప్రకృతికి, ఆధ్యాత్మికతకు దగ్గరగా ఉంటుందని పర్యావరణ పరిరక్షణ, ప్రకృతితో సామరస్యంగా జీవించడం అనేది గిరిజన వర్గాల నుండి నేర్చుకోవచ్చని తెలిపారు. ఆధ్యాత్మికత, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, మానవ సంక్షేమం.. మన సమ్మిళిత అభివృద్ధికి మూలస్తంభాలుగా చేసుకుని భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిర్మించడానికి అందరూ మరింత నిబద్ధతతో కలిసి పని చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

(వాయిస్ 25 సెకన్లు)

====================

సాంకేతికత భారతదేశంలో పరివర్తనాత్మక మార్పులను తీసుకువచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలసి పారిస్ లో వివాటెక్-2026 కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొని ఈరోజు ప్రసంగించారు. మానవ-కేంద్రీకృత ఏఐ, అత్యాధునిక సాంకేతికతల పట్ల భారతదేశపు దార్శనికతను, అలాగే వర్ధమాన సాంకేతికతల్లో భారత్-ఫ్రాన్స్ సహకారం, పెరుగుతున్న విస్తరణను ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. డిజిటల్ చెల్లింపులు, ఏఐ ఆధారిత వ్యవసాయ పురోగతి నుండి అత్యాధునిక అంతరిక్ష అనువర్తనాల వరకు సాంకేతికత దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ లు ఇరువురు ఆరోగ్య సంరక్షణ, రవాణా రంగాలకు సంబంధించిన అత్యాధునిక సాంకేతికతలు, ఆచరణాత్మక పరిష్కారాలను ప్రదర్శిస్తున్న భారతీయ అంకుర సంస్థలు, ఆవిష్కర్తలతో సంభాషించారు.

====================

దేశంలో రిఫైనరీలు తగినంత ముడి చమురు నిల్వలతో సమృద్ధిగా పని చేస్తున్నాయని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. అదే సమయంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా తగినంత ఉన్నాయని వెల్లడించారు. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గత మూడు రోజుల్లో కోటీ 36 లక్షల ఎల్‌పిజి సిలిండర్ బుకింగ్‌లు జరిగాయని, కోటీ 47 లక్షల సిలిండర్లను పంపిణీ చేశామని తెలిపారు. అదే సమయంలో 22 వేల 945 టన్నుల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లు అమ్ముడయ్యాయని వెల్లడించారు.

(వాయిస్ 27 సెకన్లు)

అదే విధంగా ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఒపేష్ కుమార్ శర్మ మాట్లాడుతూ... 62 వేల 370 మెట్రిక్ టన్నుల సరుకుతో మాల్టా జెండా కలిగిన ఎల్‌ఎన్‌జి క్యారియర్ `దిశా` నౌక రేపు ఉదయం గుజరాత్‌లోని దహేజ్ ఓడరేవుకు చేరుకోనుందని చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలోని వివిధ ప్రదేశాల నుండి గత 72 గంటల్లో 47 మందితో సహా, ఇప్పటివరకు 3 వేల 639 మందికి పైగా భారతీయ నావికులను సురక్షితంగా స్వదేశానికి రప్పించడంలో మంత్రిత్వ శాఖ సహకరించిందని తెలిపారు. విదేశాలలో ఉన్న భారతీయ నావికుల భద్రత, సంక్షేమాన్ని నిర్ధారించడానికి అవసరమైన సహాయాన్ని అందించడానికి, డీజీ షిప్పింగ్ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూ... వివిధ భాగస్వాములతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని తెలిపారు.

విరామం

====================

నషాముక్త్ పరిసర అభియాన్ లో భాగంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం సాధించిన ఘననీయమైన పురోగతిని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రశంసించారు. ఈ ఏడాది.. మాదక ద్రవ్య రహిత ప్రచార ప్రారంభోత్సవం, E-ప్రతిజ్ఞ వేదిక చొరవను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. యువత నషాముక్త్ భారత్ రాయబారులుగా మారి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా గళం విప్పాలని సామాజిక మాధ్యమం వేదికగా ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. మాదక ద్రవ్య రహిత భారతదేశ కల సాకారంలో సమిష్టి కృషి, యువత భాగస్వామ్యం కీలకమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

====================

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పరిధి, పంపిణీలో ప్రభుత్వం గణనీయమైన పురోగతిని సాధించింది. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 6,208

కోట్ల రూపాయలకు పైగా నిధులను విడుదల చేసింది. దీని ద్వారా 47 లక్షలకు పైగా విద్యార్థులు లబ్ధి పొందారు. అదేవిధంగా ఎస్సీ, ఇతర వర్గాల విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద ప్రభుత్వం 562 కోట్ల రూపాయలకు పైగా నిధులను పంపిణీ చేసింది. ఈ పథకం ద్వారా 26 లక్షలకు పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లబ్ధిదారుల సంఖ్యలో కూడా గణనీయమైన పెరుగుదల నమోదైంది.

====================

నీట్-యూజీ పునః పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (NTA) తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. ఈ నెల 21న పరీక్ష జరగనుందని, వాయిదా పడుతుందన్న వదంతులను, సామాజిక మధ్యమాల్లో వచ్చే దుష్ప్రచారాలను నమ్మొద్దని NTA 'ఎక్స్' వేదికగా సందేశాన్ని ఈరోజు విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని పేర్కొంది. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశామని, పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇక ఈ పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

====================

దేశంలోని చివరి వ్యక్తికి వరకూ చేరువ కావడమే కమ్యూనిటీ రేడియోల లక్ష్యమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. చెన్నైలోని ఆల్ ఇండియా రేడియో (AIR) కార్యాలయంలో ఈరోజు జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రజా ప్రయోజనం కోసం అవగాహన సందేశాలను అత్యంత ప్రభావవంతంగా అందించడానికి రేడియోలో నూతన ఆవిష్కరణలు అవసరమని చెప్పారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శ్రీధరన్ రేడియో రంగానికి చేసిన కృషికి గాను ఆయనను మంత్రి అభినందించారు. ఆయన కృషి ఫలితంగానే చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో మొట్టమొదటి కమ్యూనిటీ రేడియో ప్రారంభమైందని తెలిపారు. ఒడిశా, ఝార్ఖండ్ సహా దేశంలోని మారుమూల ప్రాంతాలకు కమ్యూనిటీ రేడియోను తీసుకురావడానికి ఆయన చేసిన ప్రయత్నాలను మంత్రి అభినందించారు.

====================

రాబోయే నాలుగు, ఐదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, బీహార్, ఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాల్లోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) తెలిపింది. అస్సాం, మేఘాలయ, ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్ర వేత్త ఉమా శంకర్ దాస్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

====================
====================